'ఆంధ్రభూమి' దినపత్రిక - 25.6.1987

# కోత

ఎలక్షన్ల హడావుడి.

తెల్లబట్టలోల్లు, పసుపు బట్టలోల్లు.. ఇళ్లపై పడిపోతున్నారు. సభలు పెట్టేస్తున్నారు. మైకుల్లో గోల, గగ్గోలు పెట్టేస్తున్నారు.

వాగ్దానాలు జల్లేస్తున్నారు. కోతలు కోసేస్తున్నారు.

ఊపిరి సల్పడం లేదు.

రాజయ్య క్యాజువల్ లేబరు.

ఏడెనిమిదేళ్ళుగా... పెద్ద కంపెనీలోనే!

ప్రభుత్వాలు మారుతున్నాయి. కంపెనీకి లాభాలు గోబల్లోకి దించుతున్నాయి. ఉద్యోగం పర్మినెంటు కాలేదు. అలాంటి రాజయ్యలు మూడు వందలకు పైగా ఉన్నారు.

ఓట్లకి వచ్చినప్పుడు మాత్రం క్యాజువల్స్‌ని పర్మినెంట్ చేయించేస్తాం... ఇదిగో.. చేయించేస్తాం... అదిగో... చేయించేస్తాం.. .కోతలు.. కోతలు.. వాళ్ళు పర్మినెంట్ చేస్తారనే నమ్మకం లేకపోయినా రాజయ్య వాళ్ళకి ఓటు వేశాడు.

ఎలక్షన్లు సమాప్తం.

వాతావరణం ప్రశాంతం.

'హమ్మయ్య' అని ఊపిరి తీసుకోకముందే దాడులు ప్రారంభమయ్యాయి.

బస్ ఛార్జీలు పెరిగిపోయేయి.

తన మురికివాడ నుంచి ఆ కంపెనీకి రూపాయి టికెట్ మీద రోజూ పయనించేవాడు. ఆ టికెట్ ఇప్పుడు రెండయింది. పేపర్లో పైసలు పెంచినట్టు వస్తాయి. ప్రయాణీకులకు రూపాయలు కోత పడతవి!

తనకొచ్చే రోజువారీ కూలీలో అటు రూపాయి, ఇటు రూపాయి పోగా 13 రూపాయలు చేతికి వచ్చేది. 13 రూపాయలకే అతని రోజువారి బడ్జెట్ కటకటలాడేది. ఇపుడు అందులో

మరో రెండు రూపాయల కోత!

పెంచిన పెట్రోలు ధర, గ్యాసు ధర. వాటితో సంబంధం లేదు గనుక అదృష్టవంతుణ్ణి అనుకున్నాడు. అయితే నిత్యావసరమైన ట్రాన్స్‌పోర్టు భారం పరోక్షంగా తనపైనే పడుతుందని అతనికి తెలియదు.

ఆకాశంలో మబ్బులేని పిడుగులా ప్రభుత్వం కరెంటు కోత ప్రకటించింది.

ఇళ్ళపై దయతలచి... రోజుకి గంటా, రెండు గంటలకన్నా కోత ఎక్కువ విధించవద్దన్నారు. ఫేక్టరీలకు మాత్రం రెండొంతుల కానించి మూడొంతుల దాకా కోసేయమన్నాడు కోత.

చిన్న చిన్న కంపెనీలు, ప్రయివేటు కంపెనీలు దండం పెట్టి తలుపులు మూసేసారు. పెద్ద పెద్ద కంపెనీలు యూనియన్లు బలహీనంగా ఉన్నచోట లే ఆఫ్ ప్రకటించి కార్మికులకు సగం జీతాలు ఇచ్చి పొమ్మన్నారు ఇళ్ళకి.

రాజయ్య పనిచేస్తున్న పెద్ద కంపెనీలో లే ఆఫ్ విషయమై యాజమాన్యానికీ, యూనియన్‌కి గొడవయిందో, లేక అయినట్టు కనిపించారో మొత్తానికి లే ఆఫ్ ప్రకటించలేదు. ఏవో జనరేటర్లు తెప్పించే ప్రయత్నాలు.

అయితే యాజమాన్యం మాత్రం క్యాజువల్ లేబర్ మూడొందల మందిని ఉద్యోగాల్లోంచి తీసిపారేసింది. రాజయ్య ఒక్కడు కాదు. మూడు వందల మంది.

'పని ఉన్నప్పుడు పిలుస్తాం. కరెంటు లేనప్పుడు ఇంకేం పని' అని వాళ్ళని బయటపెట్టి గేటు మూసేసారు.

వాళ్ళందరికీ ఎలాంటి యూనియన్ లేదు. కాబట్టి ఎలాంటి సెక్యూరిటీ లేదు.

రోజూ కంపెనీ గేటు దగ్గరకి కాళ్లీడ్చుకుంటూ వచ్చి... కంపెనీ ఎప్పుడు పిలుస్తారో... అని నిరీక్షణ.

చివరికి వాళ్ళూ ఏదో ఒక యూనియన్‌గా ఏర్పడ్డారు. తప్పదు. యాజమాన్యాన్ని ప్రాధేయపడుతున్నారు. నిరాహార దీక్షలు చేస్తున్నారు.

రోజులు... .నెలలు.... కేజువల్ సోదరులు... రాజయ్యలు... అలా గేటు దగ్గర దీనంగా, దైన్యంగా నించుంటుంటే డ్యూటీలకు వెళ్తున్న కార్మికులకు గుండెలు నొక్కేసినట్టుగా వుంటోంది. కడుపు తరుక్కుపోతోంది.

కరెంటు కోత కాదిది.

కడుపు కోత.

కరంటు ఈ రోజు కాకపోయినా రేపైనా రాకుండా పోదు.

పోయిన ఉద్యోగం తిరిగి వస్తుందా? – అదీ రాజయ్య భయం.

పెళ్ళాం బిడ్డలని, ఆకలి కడుపులనీ చూసే ధైర్యం లేక... పీక్కుపోయిన గెడ్డంతో, బట్టలతో... రాత్రింబగళ్ళు.. గేటు దగ్గరే... అలా నించొని వున్నాడు రాజయ్య.... ఇంకా అలా నించొనే వున్నాడు రాజయ్య. ✿